## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లాం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో మండలంలోని గొల్లాం ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు పలుక్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆ పాఠశాల పీడీ ఆర్.జగ్గారావు తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో హ్యాండ్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్ బాల్ పోటీలకు 8 మంది బాలులు, 6 మంది బాలికలు ఎంపికయ్యారు. వీరు త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

### అమ్మవారికి వెండి చీరకట్టు బహూకరణ



అర్చకుడికి వెండిచీర కట్టును అందిస్తున్న దాత బద్రి

గజపతినగరం: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని లక్ష్మీ దేవి అమ్మవారికి మండల కేంద్రానికి చెందిన భక్తుడు ఆరిశెట్టి బద్రి 1100 గ్రాముల వెండితో తయారు చేయించిన చీర కట్టును బుధవారం బహూకరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఈ వెండి చీర కట్టును అమ్మవారికి గురువారం ధరించనున్నామని చెప్పారు.

### గడ్డి వాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో లండ వారి కల్లాల్లో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రైతులు లండ అప్పన్న, లండ ముత్యాలునాయుడుకు చెందిన రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సర్పంచ్ రామునాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాలిపోయిన గడ్డి వాముల విలువ సుమారు రూ. 30వేలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

### పందుల పెంపకం దారులకు నోటీసులు

గజపతినగరం: మండల కేంద్రంలో 15 మంది పందుల పెంపకందారులకు పంచాయతీ కార్యదర్శి రమణ బుధవారం నోటీసులు ఇచ్చారు. స్థానిక పంచాయతి కార్యాలయంలో పందుల పెంపకందారులతో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో పందులు విచ్చలవిడిగా తిరుగుతుండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పంట పొలాలను నాశనం చేస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. వారం రోజుల్లోగా ఊరుకు దూరంగా పాకలు వేసుకుని వాటిని అక్కడ పెంపకం చేసుకోవాలని, పందులను విచ్చలవిడిగా వదిలేస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు.


### అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



ఎన్.జి.ఆర్.పురంలో బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న పీడీ శాంతకుమారి

గజపతినగరం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–2, ఎన్.జి.ఆర్.పురం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ శాంతకు మారి బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, చిన్నారుల హాజరుతో పాటు గర్భిణులు, చిన్నారులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందిస్తున్నారా లేదా పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పౌష్టికాహారం అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా పంపిణీ చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు.

### పురిటిపెంటలో 'ఫ్యామిలీ డాక్టర్'



విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న డాక్టర్ సాయికృష్ణ

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో 82మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు.అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గృహసందర్శన చేసి విద్యార్థులకు, చిన్నారులకు, ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

# మాట నిలబెట్టుకునే వ్యక్తి సీఎం జగన్

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచాం
- పింఛన్ల పెంపు వారోత్సవాల్లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



బొండపల్లి: నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కు తుందని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పింఛన్ల పెంపు వారోత్సవాలు బుధవారం నిర్వహించా రు. మండలంలో కొత్తగా మంజూరైన 345 పింఛన్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటప్రకారం పింఛన్ల మొత్తాన్ని సీఎం జగన్ ఏటా పెంచుతున్నారని అన్నారు. చెప్పిన ప్రకారం పింఛన్ మొత్తాన్ని మూడో దఫా రూ.250 పెంచి మొత్తంగా రూ.2,750 అంది స్తున్నామని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి అని, మాట తప్పే రకం కాదని అన్నారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ మూడున్నరేళ్ల కాలంలో ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా నిబంధనల మేరకు పింఛన్లు మంజూరు చేస్తున్నామని, ఒక్క రూపాయికి అవినీతి జరగకుండా పథకాలు అందిస్తుంటే... దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో అమల వుతున్న సంక్షేమ పథకాలు, వలంటీ ర్, సచివాలయ, రైతుభరోసా కేంద్రాల వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. అనంత రం బిల్లలవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్ల చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, గొట్లాం, రాచకిండాం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు మహంతి రమణ, గొల్లు సతీష్, నాయకులు బొద్దల చిన్నంనాయుడు,బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**నేడు దత్తిరాజేరులో..**

దత్తిరాజేరు: మండలంలో 214 మందికి మంజూరైన నూతన పింఛన్లను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్న కార్యక్రమం లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

## అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే కడుబండి



వేపాడలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్ అందచేస్తున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో 235 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను వేపాడ చెరుకు కాటా ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ మొత్తాన్ని మూడోవిడత పెంచి రూ. 2,750 అందజేస్తున్నామని, వచ్చేఏడాదికి రూ.3 వేలు అందజేస్తామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో 39 లక్షల మందికే పింఛన్ ఇచ్చారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేడు 64 లక్షల మంది పింఛన్ అందుకుంటున్నారని చెప్పారు. నాడు పింఛన్ తీసుకోవడానికి అవ్వాతాతలు పంచాయతీ, మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు కోడికూయక ముందే వలంటీర్ ఇంటి తలుపుతట్టి పింఛన్ అందిస్తున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఎలాంటి అరాచకాలు చేశాయో ప్రతి ఒక్కరికీ తెలుసని అన్నారు. చంద్రబాబునాయుడు తన ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై నిరంతరం బురదజల్లిస్తున్నారని, వారి దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచిం చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్మ న్ మూకల కస్తూరి, వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగలి జగన్నాథం, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, ముత్యాలమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, నెడ్‌క్యాప్‌డైరెక్టర్ పద్మావతి, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత**

మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన పాము రోహిత్‌కుమార్‌కు వెన్నుముక ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సిఫార్సుల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.1.60 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్‌ను బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు.

## తహసీల్దార్ కార్యాలయాల్లో కలెక్టర్ తనిఖీలు



దత్తిరాజేరు తహసీల్దార్ రమేష్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

దత్తిరాజేరు/ మెరకముడిదాం/ గుర్ల: దత్తిరాజేరు, మెరకముడిదాం, గుర్ల తహసీల్దార్ కార్యాలయాల్లో కలెక్టర్ ఏ.సూర్యకు మారి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర భూరీసర్వేపై దత్తిరాజేరు, మెరకముడిదాం తహసీల్దార్‌లు రమేష్, రత్నకుమార్, గుర్ల డీటీ సూర్యనారాయణను ఆరా తీశారు. ధాన్యం సేకరణకు సంబంధించి మిల్లుల వద్ద కస్టోడియల్ అధికారులుగా వీఆర్‌ఓలు అందుబాటులో ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో భూముల రీసర్వేను వేగవంతం చేయాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాలు అందజేయాలని ఆదేశించారు. గుర్ల తహసీల్దార్ కార్యాలయానికి అదనపు భవనాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలుపై ఆరా



బొడ్డాంలో ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ డీడీ జమదగ్ని

వేపాడ: మండలంలోని బొడ్డాం, రామస్వామిపేట, పాటూరు రైతు భరోసా (ఆర్బీకే) కేంద్రాలను ఉద్యానవనశాఖ డీడీ ఏ.వి.ఎస్.ఎస్ జమదగ్ని బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయా ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిల్లులు బ్యాంకు గ్యారెంటీలు చెల్లించకపోవడంతో తమ ధాన్యం మిల్లుకు తరలించడానికి వీలుకాలేదని, తక్షణమే ధాన్యం మిల్లులకు రవాణా అయ్యేలా చూడాలని కోరారు. సమస్య పరిష్కరిస్తామని డీడీ రైతులకు తెలిపారు. బొడ్డాం ఆర్బీకేలో 90.76 మెట్రిక్ టన్నులు, పాటూరులో 93.5 మెట్రిక్ టన్నులు, రామస్వామిపేటలో 198 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓ ఉమాభరణి, వీఏఏలు ఎం.పవన్‌కుమార్, కె.హేమలత, జి.శివ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు తవ్వకాలకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రామస్వామి

కొత్తవలస రూరల్: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని మిందివలస గ్రామంలో డెరెక్ట్ పంపింగ్ విధానంలో తాగునీరు అందించేందుకు రూ.5 లక్షలతో బోరు ఏర్పాటు పనులను సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఆర్థిక సంఘం నిధులతో బోరు వేయించామని, డైరెక్ట్ పంపింగ్ విధానం ద్వారా తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. 14వ వార్డు మెంబర్ పొలమరశెట్టి రమ్య, నాయకుడు రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### పాఠశాలకు రన్నింగ్ వాటర్ సదుపాయం



కుళాయిలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

జామి: స్థానిక మాధవరాయి మెట్టకాలనీ ప్రభుత్వ పాఠశాలలో క్వారీ యజమాని మురళి రూ.40 వేలతో ఏర్పాటు చేసిన రన్నింగ్ వాటర్ పథకాన్ని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు, తహసీల్దార్ హేమంత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. క్వారీ యజమాని మురళీని అభినందించారు. అలాగే పాఠశాలకు ఫర్నీచర్ అందజేసిన శోభ కాలేజ్ యాజమాన్యాన్ని అభినందించారు. ఎంపీడీఓ సతీష్,ఎంఈఓ జయశ్రీ, హెచ్ఎం కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

### గరుడుబిల్లిలో కోవిడ్ పరీక్షలు



కోవిడ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఒక జంటలో భార్యకు కోవిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో వారి ప్రైమరీ కాంటాక్టులకు బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ బుధవారం గ్రామంలో కోవిడ్ పరీక్షలు చేశారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు ధరించాలని వైద్యసిబ్బంది సూచించారు. ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన మహిళ ఆరోగ్యంగానే ఉందని ఎటువంటి ప్రమాదం లేదని వైద్యాధికారి తెలిపారు. హోం ఐషోలేషన్‌లో దంపతులు ఉండి చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

## సమన్వయంతో సమస్యల పరిష్కారం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సభకు వినిపించారు. రామన్నపేట, ఎం.కొత్తవలస, రంగుపురం తదితర గ్రామాల సర్పంచ్‌లు తమ గ్రామాల్లో విద్యుత్ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను రెండు మూడు రోజుల్లో పరిష్కరించేలా చూడాలని విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణమూర్తిని ఆదేశిం చారు. మండలంలో భూరీసర్వే సంతృప్తికర స్థాయిలో కావడం లేదని తహసీల్దార్ అరుణకుమారిపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే చేపడుతున్న చోట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు చొరవ తీసుకుని, సర్వే సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ, వారికి సహకరించినప్పుడే సర్వేలో తప్పులు జరగకుండా ఉంటాయని అన్నారు.

**పథకాల ద్వారా రూ.987 కోట్లు లబ్ధి**

మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ పథకాల ద్వారా గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.987 కోట్లు జమచేసిందని ఎమ్మెల్యే అప్పలనరసయ్య చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్నప్పటికీ, అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ... టీడీపీ నేతలు మాత్రం పింఛన్‌లు తీసేశామని బురదజల్లడం సరి కాదని అన్నారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, వైస్ ఎంపీపీలు కర్రి శ్రీదేవి, గెద్ద దమయంతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపలో ఆదరణ



అలమండ గ్రామంలో గడపగడపకూ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: మండలంలోని అలమండ సచివాలయం పరిధి నారాయణపురం గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే చెప్పాలని కోరారు. గ్రామస్తులు కొందరు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తోందని చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. రూపాయి అవినీతి లేకుండా పథకాల లబ్ధి ఖాతాలకు చేరుతోందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు జి.సరయు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షురాలు ఎస్.అరుణ, ఉపాధ్యక్షుడు జి.వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉపసర్పంచ్ ఎల్.దేముడు, గొర్లె రవి, కాకర్లపూడి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

## పప్పుల చీటీ బాధితులు ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: పప్పుల చీటీ (నిత్యావసర సరుకులు) కట్టి మోసపోయిన వారు చీటీ నిర్వాహకుల బంధువులపై దాడులు చేయకుండా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసేలా అవగాహన కల్పించాలని స్థానిక సీఐ ఎల్.అప్పలనాయుడు సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో సర్కిల్ పరిధి మహిళా పోలీసులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పప్పుల చీటీల బాధితులు ఉన్నట్లు సమాచారం వచ్చిందని అన్నారు. బాధితులు ఎలాంటి భయాందోళన చెందకుండా ఎంత నగదు కట్టారు, ఎవరికి కట్టారో తగిన ఆధారాలతో పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేసి న్యాయం జరిగేలా చేస్తామని అన్నారు. బాధితులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ధైర్యం కల్పించాలని మహిళా పోలీసులకు సూచించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోటి పందేల శిబిరాలు నిర్వహిస్తే సమాచారం అందించాలని అన్నారు. ఎస్ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి బ్రెయిలీ




శృంగవరపుకోట: ర్యాలీ చేస్తున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

బొండపల్లి: లూయిస్ బ్రెయిలీ కృషి వల్ల అంధుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎంఈఓ ఎం.బూసినాయుడు అన్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించిన లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల సమక్షంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**అంధుల పాలిట దైవం**

చీపురుపల్లి: లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట దైవమని బాలుర ఉన్నత పాఠశాల ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయిని సుశీల అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను పట్టణంలోని పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం ఎస్.వి.రమణ, ఐఈఆర్‌పీలు త్రినాథరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

**మెరకముడిదాంలో...**

మెరకముడిదాం: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఐఈఆర్‌పీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ప్రత్యేక అవసరాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**గరివిడిలో..**

చీపురుపల్లిరూరల్(గరివిడి): లూయిస్ బ్రెయిలీ జయంతిని గరివిడి భవిత కేంద్రంలో ఎంఈఓ పి.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు జి.రమణారావు,పి.సుమలత తదితరులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**ఎస్.కోటలో..**

శృంగవరపుకోట: స్థానిక భవిత కేంద్రంలో ఐఈఆర్‌పీలు బి.లీలాకృష్ణ, జి.సత్యన్నారాయణ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి అతిథులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అనంతరం కేక్ కట్ చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయుడు జోగేంద్ర, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సూర్యనారాయణ,బాలికోన్నత పాఠశాల ఐఈడీఈఎస్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, ప్రత్యేక అవసరాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బొండపల్లి: బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంఈఓ బూసినాయుడు, తదితరులు



చీపురుపల్లిరూరల్: గరివిడిలో బ్రెయిలీ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పిస్తున్న ఎంఈఓ రామారావు



మెరకముడిదాం: మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీనివాసరావు



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయిని సుశీల

## సీఎం జగన్ పేదల పక్షపాతి



గంట్యాడ: వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో సచి వాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సా ర్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మ, సచివాలయ కన్వీనర్లు వర్రి కొండమ్మ, మండల సూరి అప్పారావు, పాశల వెంకట అప్పలనాయుడు పాల్గొన్నారు.

**అర్హతే ప్రామాణికం**

చీపురుపల్లి: అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి అన్నారు. నూతన పింఛన్లను పట్టణంలోని గవిడివీధిలో లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి గోవింద, మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, మీసాల రామారావు, మహంతి ఉమ, పొండ్రంకి వాసు, కరణపు ఆది, రెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

**పేదల శ్రేయస్సే ధ్యేయం**

చీపురుపల్లిరూరల్: పేదల శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్ అన్నారు. పత్తికాయవలస గ్రామంలో లబ్ధిదారులకు బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.



చీపురుపల్లి: పింఛన్లు అందజేస్తున్న ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి తదితరులు